# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 190
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఏప్రిల్ 26, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





## ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయండి

▣ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులు ఆదేశించారు. శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ పరిధితోపాటు ఖానాపూర్ మండల కేంద్రంలో రెండో విడత ఇందిరమ్మ గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను ఆమె పరిశీలించారు.

– వరంగల్ వాయిస్, నర్సంపేట



# చలో వరంగల్

## గులాబీ పండుగకు సర్వం సిద్ధం

వివరాలు 2లో..

సమయం ఆసన్నమైంది. గులాబీ పండుగకు సర్వం సిద్ధమైంది. పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేస్తుకున్న సందర్భంగా కని, విని ఎరుగని రీతిలో రజతోత్సవ సభ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. దేశం తెలంగాణ వైపు చూసేలా 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో భారీ భహిరంగ సభ నిర్వహించేందుకు బీఆర్ఎస్ కసరత్తు పూర్తి చేసింది. ఇప్పటికే గులాబీ దండు ఎల్కతుర్తి బాట పట్టింది. పాదయాత్రలు, ఎడ్లబండ్లు, ప్రభబండ్ల ద్వారా జాతరోలే కదిలివస్తున్నారు. భారీ భహిరంగ సభకు సుమారు పది లక్షల మంది హాజరవుతారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 400 మంది ప్రతినిధులు ఆసీనులయ్యేలా 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదికను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఈ మహా సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు కల్పించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని 10 లక్షల వాటర్ ప్యాకెట్లు, 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచారు. 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. 1,213 ఎకరాల్లో నిర్వహించనున్న రజతోత్సవ మహాసభకు విద్యుత్ ఆటంకాలు తలెత్తకుండా 200 భారీ జనరేటర్లు, సభలో ఎక్కడ ఉన్నప్పటికీ అందరికీ ప్రధాన వేదిక కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను, చెవులు దద్దరిల్లేలా సౌండ్ సిస్టమ్ ను ఏర్పాటు చేశారు. పార్కింగ్ నిర్వహణకు 2వేల మంది వలంటీర్లను నియమించారు. ఊరూ.. వాడ ఒక్కటై చలో వరంగల్ అంటూ తరలివస్తున్న వారికి గులాబీ తోరణాలు స్వాగతం పలుకుతున్నాయి.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

- 1,213 ఎకరాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ
- 400మంది ప్రతినిధులు కూర్చునేలా భారీ వేదిక
- విద్యుత్ అంతరాయాలు లేకుండా 200 భారీ జనరేటర్లు
- 23 అతి పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లు
- 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు
- పార్కింగ్ నిర్వహణకు 2వేల మంది వలంటీర్లు



## కల్లు, గుడాలు ఏమాయే..?

- బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి
- గప్పాలు కొట్టేందుకు పిట్టలదొర మళ్లీ వస్తున్నాడు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

8లో..




8లో..




## మావోలతో శాంతి చర్చలు జరపాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి | పౌర హక్కుల సంఘాల వినతి

# చలో వరంగల్

## గులాబీ పండుగకు సర్వం సిద్ధం



- 1,213 ఎకరాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ
- 400మంది ప్రతినిధులు కూర్చునేలా భారీ వేదిక
- విద్యుత్ అంతరాయాలు లేకుండా 200 భారీ జనరేటర్లు
- 23 అతి పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లు
- 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు
- పార్కింగ్ నిర్వహణకు 2వేల మంది వలంటీర్లు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** కుంభమేళాను తలపించేలా ఓరుగల్లులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నారు. ఇది యావత్ భారత దేశంలోనే చారిత్రాత్మకం కానుంది. తెలంగాణలోని ప్రతి పల్లె, ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తితో బీఆర్ఎస్ పెనవేసుకున్నది. తెలంగాణతోపాటు చుట్టు పక్కల రాష్ట్రాలనుంచి కూడా ఈ సభకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఉద్యమ పార్టీగా అవతరించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభ కని, విని ఎరుగని రీతిలో ఉంటుంది. ఊరూ..వాడ.. పల్లె.. పట్టణం అనే తేడా లేకుండా పోదాంపద జన జాతర అంటూ మూటా ముల్లె సర్దుకుంటున్నారు. ఉసిల్ల దండులా ఎల్కతుర్తి బాట పడుతున్నారు. ఎల్కతుర్తితోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోని దారులన్నీ భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, గులాబీ తోరణాలతో సభకు వచ్చేవారికి స్వాగతం పలుకుతున్నాయి.

### పది లక్షల మంది హాజరు..

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్కతుర్తి వేదికగా ఆదివారం జరిగే బీఆర్ఎస్ సభ నభూతో..న భవిష్యత్ అన్న రీతిలో చరిత్రలో నిలిచి పోనుంది. అందుకు తగ్గట్టుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదిక దగ్గర నుంచి పార్కింగ్ ఏర్పాట్ల వరకు ఏ ఒక్కరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. 1,213 ఎకరాల్లో నిర్వహించనున్న భారీ భహిరంగ సభకు కనీసం పది లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కనీసం 40 వేల వాహనాలు నిలిపేలా 1,059 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వీఐపీ వాహనాలకోసం సభా వేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్ ను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చే వారికి అనుగుణంగా ఈ పార్కింగ్ స్థలాలను ఐదు జోన్లుగా విభజించారు. పార్కింగ్ నిర్వహణ కోసం 2 వేల మంది వలంటీర్లను నియమించారు. మహాసభ ప్రాంగణంలో వాహనాలు, ప్రజలు వచ్చేందుకు వీలుగా గ్రీన్, రెడ్ కార్పెట్లు ఏర్పాటు చేశారు. మహాసభకు ముందుగా వచ్చిన వారు కూర్చునేలా లక్షకు పైగా కుర్చీలను ఏర్పాటు చేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారీకేడ్లు పెట్టారు.

### భారీ వేదిక..

ఎక్కడినుంచైనా వేదిక కనిపించేలా ఎనిమిది అడుగుల ఎత్తులో సుమారు 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం సిద్ధం చేశారు. వేదిక మొత్తం గులాబీ రంగులతో అద్భుతంగా తీర్చిదిద్దారు. సుమారు 400 మంది ఆశీనులయ్యేలా 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన వేదిక ముందు వీఐపీలు, మీడియా ప్రతినిధుల గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా దూరంగా ఉన్న వారికి వేదికపై ఎవరెవరు ఉన్నారు..ఎవరు ప్రసంగిస్తున్నారు అన్నవి కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను, చెవులు దద్దరిల్లేలా సౌండ్ సిస్టమ్ ను ఏర్పాటు చేశారు.

### జిగేల్ అనిపించేలా..

మహా సభ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులతో జిగేల్ అనిపించేలా లైట్లు, ఎల్ఈడీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 200 భారీ జనరేటర్లను వినియోగించుకుంటున్నారు. రాత్రి సమయంలో తిరుగు ప్రయాణం అయిన వారికి ఇబ్బందులు కలుగకుండా దారి పొడవునా భారీ సంఖ్యలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మహా సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సర్వం సిద్ధం చేశారు. 1,200 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

### అందుబాటులో ప్రథమ చికిత్స..

వేసవి నేపథ్యంలో సభకు వచ్చేవారు ఎలాంటి అస్వస్తతకు గురి కాకుండా ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రూట్లలో ఆరు అబులెన్సులను అందుబాటులో పెట్టారు. పరిసరాల్లో 12 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాథమిక కేంద్రంలో ముగ్గురు డాక్టర్లు, ఐదుగురు నర్సులు విధులు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా బయో టాయిలెట్లను సిద్ధం చేశారు. సభకు వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు 10 లక్షల వాటర్ బాటిళ్లు, 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచారు.

### ట్రాఫిక్ మళ్లింపు..


బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున వరంగల్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 12 గంటల వరకు సభ జరుగనున్న క్రమంలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ వెల్లడించారు. కరీంనగర్ నుంచి హనుమకొండ, వరంగల్ కు వచ్చే వాహనాలు హుజూరాబాద్–పరకాల క్రాస్ రోడ్డు, ఉప్పల్, కమాలాపూర్, అంబాల, ముచ్చర్ల క్రాస్ రోడ్డు నుంచి కొత్తగా నిర్మించిన ఓఆర్ఆర్ మీదుగా రావాలని, వరంగల్, హనుమకొండ నుంచి తిరిగి వెళ్లే వాహనాలు అదే మార్గంలో కరీంనగర్ వైపు వెళ్లాలని చెప్పారు. సిద్దిపేట నుంచి హనుమకొండ వైపు వచ్చే వాహనాలు సిద్దిపేట, జనగామ మీదుగా వచ్చి, తిరిగి అదే మార్గంలో వెళ్లాలన్నారు. హుస్నాబాద్ నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు హుస్నాబాద్, తరిగొప్పలు మీదుగా వచ్చి తిరిగి అదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. లేదా భీమదేవరపల్లి మండలం ములకనూర్, కొత్తకొండ, వేలేరు, మల్లికుదుర్లు, క్యాతంపల్లి, పెద్ద పెండ్యాల మీదుగా హనుమకొండకు చేరుకోవచ్చన్నారు.

# ఉప్పెనలా కదలాలే..

- తెలంగాణ వాదాన్ని నలుదిక్కులా చాటుదాం..
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



హనుమకొండ జిల్లా ఎలుకతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రజలు ఉప్పెనల కదలాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి.. ఊరు వాడ దండులా కదిలి..తెలంగాణ వాదాన్ని నలుదిక్కుల వినిపించాలని ఆయన కోరారు. చలో ఎల్కతుర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గులాబీ సైనికులు కృషి చేయాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చేట్లుగా చూడాలని, బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. 6 గ్యారంటీలు 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, బీఆర్ఎస్ రజతోత్సవ సభను కనీ విని ఎరుగని రీతిలో విజయవంతం చేయాలన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈ సభ ద్వారా సంకేతాలు పంపించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓరుగల్లులో బీఆర్ఎస్ రజితోత్సవ సభను హోరెత్తించేందుకు పల్లె, పట్టణం పయనమైందని ఆయన తెలిపారు. కేసీఆర్ ప్రసంగం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.






## బారీగా తరలి వస్తున్నారు.. దాస్యం వినయ భాస్కర్

రైతులు బండెనుక బండి కట్టి.. ఆటో కార్మికులు ఆటోల్లో, యువకులు మోటార్ సైకిళ్లపై రజతోత్సవ సభకు ఉప్పెనలా తరలి వస్తున్నారని మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ చెప్పారు. సూర్యపేట నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నాయకత్వంలో రైతులు ఎండ్ల బండ్ల ద్వారా సభాస్థలికి రెండు రోజుల క్రితం బయలు దేరగా.. నేడు హనుమకొండ పట్టణానికి చేరుకున్న వారికి వినయ భాస్కర్ స్వాగతం పలికారు. అలవి కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కొద్ది సేపు ఎడ్ల బండి నడిపి అందరినీ ఉత్తేజపరిచారు. ఎడ్ల బండ్లపై వచ్చిన రైతులకు శాలువా కప్పి సత్కరించారు. మెమొంటోలు అందించారు.

## భారీ బందోబస్త్

ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభకు భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. 1,100 మందికి పైగా పోలీసులు ఈ బందోబస్త్ లో పాల్గొననున్నారు. ఇందులో ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డిసీపీలు, ఎనిమిది మంది ఏసీపీలు, 28మంది ఇన్ స్పెక్టర్లు/ఆర్ఐలు, 66 ఎస్సైలు, 137 ఏఎస్సైలు/హెడ్ కానిస్టేబుళ్లు, 511 మంది కానిస్టేబుళ్లు, 200 మంది హోంగార్డ్స లతో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.



# రజతోత్సవ మహాసభకు బయలెల్లిన ప్రభబండి

## ◆ ప్రారంభించిన చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, సంగెం :** రేపు ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా సంగెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభ బండిని శనివారం ఉదయం పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గడప నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి బీఆర్ఎస్ సత్తా చాటుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవనం సాగించేలా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు చేపట్టినట్టు గుర్తుచేశారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీని వదిలిపోయే వాళ్ల గురించి ఆలోచించాల్సిన అసరం లేదని



తెలిపారు. గ్రామాల్లో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమి లేదని చెప్పారు. మేడారం జాతరను తలపించేలా ఎల్కతుర్తి సభ ఉంటుందన్నారు. సభకు వచ్చే వాహనాల కోసం 1,200 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభకు వచ్చే ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల మేలు కోసమే భూభారతి చట్టం

## ➲ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, దామెర :** రైతుల మేలు కోసమే భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం దామెర మండల కేంద్రంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో భూభారతి చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం రేవూరి మాట్లాడుతూ నూతన భూభారతి చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలు రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ధరణిలో కానీ భూ సమస్యలు ఇప్పుడు పరిష్కారం అవుతాయన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతాంగ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం అన్నట్లుగానే నూతన ఆర్ఓఆర్ భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. గతంలో మార్పులకు చేర్పులకు అవకాశం ఉండేది కాదని, ప్రస్తుత చట్టంలో రెవెన్యూ అధికారులే అన్ని సమస్యలకు పరిష్కారాలు చూపుతారన్నారు. భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే సార్ధకత ఏర్పడుతుందన్నారు. భూభారతి చట్టాన్ని నిష్ణాతులైన మేధావులు, అధికారులు కలిసి భూభారతి చట్టాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా నూతన



ఆర్ఓఆర్ ప్రకారం అధికారులే కాకుండా రైతులు సైతం అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డుల మాదిరిగానే భూధార్ కార్డులను భూమి కలిగిన రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి రాకేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, అధికారులు పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బీఆర్ఎస్ సభ..

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పత్రికా, మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఏం చేసారో చెప్పి రేపు ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ సభను జరుపుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించేది రజతోత్సవ సభ కాదు అనైతిక సభ అని, కేసీఆర్ చరిత్ర అబద్ధాల చరిత్ర అని అన్నారు. సోనియమ్మ కాళ్లు మొక్కి, తెలంగాణ కాంగ్రెస్ వల్లే వచ్చిందని నాడు ప్రజలకు చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మిగులు బడ్జెట్ తో ఉన్న ధనిక రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు.



# కేంద్రం జన గణనతో పాటు కుల గణన చేయాలి

## ➲ తాటిపాముల వెంకట రాములు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే జన గణనతో పాటు కుల గణన కూడా చేయాలని కుల జనాభా ఆధారంగా బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీ అభివృద్ధికి తోడ్పడాలని తాటిపాముల వెంకట్ రాములు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం బీసీ హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట రాములు మాట్లాడుతూ చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓబీసీ ఆల్ ఇండియా జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ బీసీలకు విద్యా ఉద్యోగాలలో స్థానిక సంస్థలలో కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్నట్టు తక్షణమే 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని పాలకుల డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు




బట్టి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ జనాభాలో 90 శాతంగా ఉన్న బీసీ సమాజం పది శాతంగా ఉన్న ఎక్కువ కులంచే పాలించబడడం విచారకరమన్నారు. భారత్ బచావో నాయకుడు దొమ్మాటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బీసీలు అంటే బెస్ట్ క్లాస్ నైపుణ్యత కలిగిన బీసీలను పాలకులు కావాలని, ఆర్థికంగా, సాంఘికంగా వెనకకు నెట్టివేసి వెనుకబడిన తరగతులన్నారు. ఈ సమావేశంలోసైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ చార్వాక, బీసీ హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, బైరి తిరుపతి, మడ్డి రాజారాం, బి రమేష్, టి ప్రశాంత్, పి రామ్ గోపాల్ చారి, జి.రాజేందర్, పాలబిందల సాత్విక్, వెంకటేష్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరగొండ గ్రామంలో బీజేపీ మాజీ బూత్ అధ్యక్షుడు ఎదిగితే చేరాలు నాన్న కొమురయ్య ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి, మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పావుడాల మధుకర్, బీజేవైఎం మండల అధ్యక్షులు కొట్టే రమేష్, బూత్ అధ్యక్షులు మంద మనోజ్, చెక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం



**వరంగల్ వాయిస్, నడికూడ :** భారత రాష్ట్ర సమితి 25 వసంతాల రజతోత్సవ సభ ఏప్రిల్ 27న వరంగల్ లోని ఎల్కతుర్తిలో అంగరంగ వైభవంగా జరగనుందని నడికూడ మండల బీఆర్ఎస్ నాయకులు తాళ్ల వంశీ ముదిరాజ్ తెలిపారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాదిగా జనం ఈ సభకు హాజరుకానున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఆవిర్భవించి ఉద్యమ పంథాతో అధికారంలోకి వచ్చి దశాబ్దం పాటు తెలంగాణ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంచింది. కేవలం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనార్థం పుట్టిన బీఆర్ఎస్ పార్టీ రేపు 25 వసంతాలు పూర్తి చేసుకోబోతుంది. ఉద్యమ సింహం కేసీఆర్ ప్రజల సంక్షేమంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి ఏం మాట్లాడుతారో, ప్రజలకు ఎలాంటి భరోసా కల్పిస్తారో అని 4 కోట్ల రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. రాష్ట్రం మొత్తం టీవీలు, మొబైల్ ఫోన్ల ద్వారా కేసీఆర్ సభను వీక్షించే అవకాశముంది. ప్రతి ఒక్కరం పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరుతున్నానని తెలిపారు.

# భారత్ సమ్మిట్ లో కుడా చైర్మన్ ఇనగాల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నగరంలోని నోవోటెల్ హెచ్ఐసీసీ (హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్)లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో వరంగల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమ్మిట్ రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టబడింది. ప్రపంచవ్యాప్తంగా 100కి పైగా దేశాల నుండి ప్రభుత్వాధినేతలు, ఎంపీలు, జాతీయ స్థాయి నాయకులు, కార్పొరేట్ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సమిట్‌లో కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు అయిన అహింస, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. అంతేకాక, తెలంగాణను గ్లోబల్ రోల్ మోడల్‌గా ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై కూడా మేధో సమావేశాలు నిర్వహించారు. సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులకు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళాభివృద్ధికి కాంగ్రెస్ ప్రాధాన్యం

## నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీరెడ్డి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండల, పట్టణ మహిళా నాయకులతో తొర్రూరు కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పెద్దపీట వేసిందని, కాంగ్రెస్ పార్టీకి మహిళా శక్తి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు దూసుకెళ్లాలని, ఇక్కడ నాయకత్వం వహిస్తున్న శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి ఒక మహిళ కావడంతో మిమ్మల్ని అందరిని కూడా అన్ని రంగాలలో ప్రోత్సహిస్తుందని, శాసనసభ్యురాలుతో పాటు నేను కూడా మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి మహిళలకు తగిన గౌరవం అందిస్తానన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష, మండల అధ్యక్షురాలు బూర్గుల ప్రశాంతిలతో పాటు మండలం నుంచి అన్ని గ్రామాల మహిళా పార్టీ అధ్యక్షురాళ్లు, పట్టణంలోని 16 వార్డులకు సంబంధించిన మహిళ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల.. నాణ్యమైన విద్యకు చిరునామా



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా విద్యార్థుల సంక్షేమానికి కూడా కేంద్ర బిందువుగా మారాయని మండల విద్యాధికారి ఆంగోతు లక్ష్మి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శనివారం డోర్నకల్, హన్యా తండా, సిగ్నల్ తండాల్లో విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ జరుగుతున్న కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉభయ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.నరసింహారావు, వెంకటరావు, జాస్మిన్ తో పాటు ఎన్.అప్పిరెడ్డి, కె. శంకర్, జి.మంజులత, ఎస్. శ్రీనివాస్, జి. బిచ్చా, కె. రవి కుమార్, సాయబ్ అలీ, బి.సీతారాములు, శకుంతల, రేణుక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.లక్ష్మి మాట్లాడుతూ, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థం కావడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా బోధన సాగించేందుకు కంప్యూటర్లు, టాబ్లెట్లు అందించామన్నారు. సైన్స్ లాబరేటరీలు, లైబ్రరీలు నిర్మించడంలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వసతులు అందించామని వివరించారు.ప్రైవేట్ పాఠశాలలకు అధిక మొత్తంలో ఫీజులు చెల్లించకుండా, ఆ డబ్బును తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. వారి నుంచి సానుకూల స్పందన వస్తోందని, ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐకేపీ ధాన్యం కొనుగోలు నిర్వాహకులపై కేసు నమోదు

## తూనికల కొలతల అధికారిణి శ్రీలత



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** రైతులు పండించిన పంట కొనుగోలు కేంద్రాలలో చేతివాటం ప్రదర్శిస్తూ రైతులను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తూనికల కొలతల అధికారిణి శ్రీలత హెచ్చరించారు, శనివారం హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో సాయిబాబా ఐకేపీ గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం (కాంట) లో రైతులను మోసగిస్తూ చేతివాటం ప్రదర్శించిన ఐకేపీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి జరిమానా విధించి కాంటాను సీల్ చేసినట్లు తెలిపారు.

# అర్హులైన నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వేగవంతం చేసి, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇండ్లను మంజూరు చేయాలని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలి. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించడంలో స్థానిక నాయకులు, కార్పొరేటర్లు చురుకుగా వ్యవహరించాలని" సూచించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ సహాయంగా రూ.5 లక్షలు నలుగురు దశలలో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అత్యవసరంగా అవసరమున్న వారు మొదటి దశలో ఇండ్లకు అర్హత పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశానికి ముందు పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నేతలు మౌనంగా నివాళులు అర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ రావు, సీనియర్ నాయకులు మహమ్మద్ అంకుష్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, సయ్యద్ విజయశ్రీ రజాలి, మామిండ్ల రాజు, పోతుల శ్రీమాన్, మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ అబూబకర్, మైనారిటీ సెల్ చైర్మన్ మిర్జా అజీజుల్లా బేగ్, గుంటి స్వప్న, బొమ్మతి విక్రం, రహీమున్నిసా బేగం, బంక సంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల నిర్లక్ష్యం శిక్షార్హం

## మైనరకు వాహనాలు ఇవ్వొద్దు



**వరంగల్ వాయిస్, కురవి :** 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు అందిస్తే, వారి తల్లిదండ్రులే శిక్షార్హులవుతారని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరీక్ష పండ్ల అశోక్ పేర్కొన్నారు. శనివారం కురవి నుంచి ఖమ్మం వెళ్తున్న రోడ్డులోని గురుకులం సమీపంలో జరిగిన బైక్ వాహన తనిఖీల్లో ఆయన పాల్గొన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో 18 సంవత్సరాల లోపు విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నదాన్ని గుర్తించి, వారితో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం మళ్లీ ఇలాంటివి జరగకుండా శపథం చేయించి, క్షమాపణ పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డా. అశోక్ మాట్లాడుతూ బాల్యం వయస్సులో విద్యార్థులు తాత్కాలిక మోజుతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, ఇది కేవలం వారి జీవితానికే కాదు, ఇతరులకు కూడా ముప్పుగా మారుతున్నదన్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్యం అవసరమైన వారికి రోడ్లపై ఉన్న మైనర్ల వాహనదారుల వల్ల ఆలస్యం కావచ్చని చెప్పారు. "వాహనాలు ఇవ్వడమంటే తల్లిదండ్రుల బాధ్యత. చట్టం ప్రకారం మైనర్ చేత వాహనం నడిపిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకునేలా సెక్షన్ 199A మోటార్ వెహికల్ యాక్ట్ రూపొందించబడింది," అని డా. అశోక్ స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కురవి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్, కానిస్టేబుల్‌లు వీరన్న, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇనుప వస్తువుల చోరిలో దొంగల అరెస్ట్




**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇనుప వస్తువుల దొంగతనానికి సంబంధించి ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటన గురించి ఆత్మకూర్ సీఐ సంతోష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఇంచర్ల గ్రామానికి చెందిన వనం కవిత, వరంగల్ చింతల్ ఏరియాకు చెందిన ఈసంపల్లి రాహుల్, మరో మహిళతో కలిసి గీసుకొండ మండలం చింతలపల్లి టెక్స్ టైల్ పార్క్ సమీపంలో ఇనుప వస్తువులను దొంగతనం చేశారు. దొంగిలించిన వస్తువులను ఆటో (TG 24 T 1303)లో ములుగు జిల్లాలో విక్రయించేందుకు తరలిస్తూ ఉండగా, పెద్దాపురం సమీపంలో వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ దాడిలో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మిగిలిన మహిళ పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఇంతకుముందు కూడా వీరు కొత్తగట్టు సమీపంలోని చల్లా ఇన్‌ఫ్రా ప్లాంట్ వద్ద 22 కిలోల కాపర్ వైర్ దొంగతనం చేసి, వరంగల్ పరిధిలో అమ్మి వచ్చిన డబ్బును పంచుకున్నారని సీఐ పేర్కొన్నారు. ప్రస్తుతం దొంగిలించిన ఇనుప వస్తువుల విలువ సుమారు రూ.1.50 లక్షలుగా అంచనా వేశారు. పరారీలో ఉన్న నిందితురాలిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడిలో ఎస్సై తిరుపతి, పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

# ఫార్మసిస్టులకు "ఫార్మసీ ఆఫీసర్స్"గా గుర్తింపు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ హర్షం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఫార్మసిస్టులకు మంచి రోజు ఆసన్నమైంది. ప్రభుత్వం తాజా ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఫార్మసిస్టులను "ఫార్మసీ ఆఫీసర్స్"గా పిలవనుంది. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా జారీ చేసిన జీఓ నెం. 71తో మార్పు అధికారికమైంది. తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర కమిటీ ముందుగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కు 2024 ఫిబ్రవరి 21న రిప్రజెంటేషన్ సమర్పించగా, దానిని అనుకూలంగా పరిశీలించిన డైరెక్టర్, లేఖ నెం. 2213/ ప్లానింగ్.ఏ/2024 ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అనంతరం టీజీపీఏ రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రిని పలుమార్లు కలిసి వినతులు తెలియజేసింది. 2025 జనవరి 1న జూబ్లీహిల్స్ లోని మర్రి చెన్నారెడ్డి భవన్ లో జరిగిన రాష్ట్ర ఆరోగ్య శాఖ అత్యున్నత స్థాయి సమావేశంలో టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ 22 నిమిషాల పాటు రాష్ట్ర ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను హెల్త్ మినిస్టర్‌కు స్పష్టంగా వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి, సమస్యలు సబబుగా ఉన్నాయని అంగీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే వేదికపై "ఫార్మసీ ఆఫీసర్"గా పేరు మార్పును ఆమోదిస్తూ ఫైల్‌పై సంతకం చేసినట్లు మంత్రి ప్రకటించారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై టీజీపీఏ రాష్ట్ర కమిటీ సీఎం, ఆరోగ్య మంత్రి, హెల్త్ సెక్రటరీ, హెల్త్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ విజయంలో తోడ్పడ్డ రాష్ట్ర అధికారులు, టీజీపీఏ నేతలు, అన్ని జిల్లాల కార్యవర్గాలు, ఫార్మసిస్టులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఫార్మసిస్టుల అభివృద్ధిలో ఒక మైలురాయిగా భావిస్తున్నారు.

# పేద కుటుంబానికి.. పెద్ద కష్టం

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు
- చికిత్సకు రూ.15 లక్షలు అవసరం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు




**వరంగల్ వాయిస్, రేగొండ :** అసలే పేదరికం.. కూలీ పని చేస్తే తప్ప నోట్లోకి ముద్ద వెళ్లని దుస్థితి. ఉన్నదాంట్లోనే ఏ లోటు లేకుండా జీవిస్తున్నారు. ఇంతలోనే ఆ కుటుంబ ఇంటి పెద్ద వెంకటేష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే ఉమ్మడి రేగొండ మండల కేంద్రానికి చెందిన కూరాకుల చిన్న మల్లయ్య కొడుకు, వెంకటేష్ ప్రమాదవశాత్తు ఈ నెల 22న వ్యక్తిగత పని నిమిత్తం తన స్నేహితుడు లింగమూర్తితో కలిసి రేగొండ నుంచి పరకాలకు వెళ్లే క్రమంలో వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. కారు కింది భాగంలో ఇరుక్కొని దాదాపు చాలా దూరం మట్టుకు తీసుకెళ్లగా వెంకటేష్ తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుడు మండల కేంద్రంలోనీ పోలీస్ స్టేషన్ ప్రక్కన మొబైల్ రిపేర్ సెంటర్ షాపును నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటేష్ తలకు, బలమైన గాయాలు అవ్వగా. ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వెంకటేష్ కోలుకోవడానికి సమయం పడుతొందని వైద్యులు తెలిపగా పేద కుటుంబానికి పెద్ద కష్టం రావడంతో ఆర్థిక స్తోమత లేక విలవిలలాడతున్నారు.ప్రస్తుతం చికిత్స కోసం హనుమకొండ ములుగు రోడ్డులోని గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. కాగా, చికిత్సకు దాదాపు రూ.15 లక్షలపైగా అవసరమవుతుందని తెలియడంతో ఆ కుటుంబం ఆందోళన చెందుతుంది. కనీసం సొంత ఇల్లు కూడా లేని తమకు, ఇప్పటికే శక్తికి మించి అప్పు చేసి, రోజూ చికిత్స చేయిస్తున్న ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వెంకటేష్ కు భార్య, పాప, బాబు చిన్న పిల్లలు ఉన్నారు. ఎవరైనా ముందుకు వచ్చి సహాయం చేసి తన భర్తను కాపాడలంటూ వెంకటేష్ భార్య కన్నీటి పర్యంతమవుతుంది. ఎవరైనా దాతలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా నిరుపేదలకు అండగా ఉండే స్థానిక ఎమ్మెల్యే, తన కుమారుడికి వైద్యం చేయించి తమ కుటుంబానికి అండగా నిలవాలని వెంకటేష్ తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎవరైనా దాతలు ఉంటే కూరాకుల సందీప్ HDFC ఖాతా నెంబర్ 50100681060552, IFSC CODE :HDFC0000512.గూగుల్ పే, ఫోన్ పే నెంబర్ 9154935713కు సాయం అందించాలని కోరారు.

# భూసమస్యల పరిష్కారానికే 'భూభారతి' చట్టం




- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**వరంగల్ వాయిస్, మల్హర్ :** ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న అనేక భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. శనివారం మల్హర్ మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల ఇబ్బందులు తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్త ఆర్వోఆర్ చట్టం 2025, భూ భారతి పోర్టల్ అమలులోకి తీసుకువచ్చిందని, ఈ చట్టంతో రైతులకు భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని, గతంలో ధరణిలో ప్రతి సమస్యకు సీసీఎల్ఏలో మాత్రమే పరిష్కారమయ్యేదని, కానీ భూ భారతిలో తహసీల్దార్ స్థాయి నుంచి కలెక్టర్ స్థాయి వరకు వివిధ దశలలో సమస్యలు పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా భూ భారతి అమలు చేసి సమస్యలకు పరిష్కరిస్తుందని, మే మొదటి వారంలో జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూ సమస్యలు పరిష్కరిస్తామని, జూన్ 2 నుంచి భూ భారతి పోర్టల్ పూర్తి స్థాయిలో అమలులోకి వస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలను పరిష్కరించు కోవాలని వారు సూచించారు. 2014 వ సంవత్సరానికి ముందు తెల్ల కాగితాలపై భూ లావాదేవీలు జరిపి 2020లో సాదా బైనామాల క్రమ బద్ధీకరణ కోసం మీసేవలో అప్లై చేసుకున్న వారి దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారి భూములను రెగ్యులర్ చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ రవి కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఏవో శ్రీజ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మల్హల్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, రైతులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని కాలేజీలను సీజ్ చేయాలి

- ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర నేత గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర విద్యా శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా హనుమకొండ పట్టణం భీమారం, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాలలో నిర్వహిస్తున్న అవని జూనియర్ కళాశాలలను సీజ్ చేసి ఆ యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్ డీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ పట్టణం నుంచి అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఎఫ్ డి ఎస్)తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ భీమారం, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలోని అవని జూనియర్ కళాశాల ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఎలాంటి పర్మిషన్ లేకుండా, పెద్ద పెద్ద హోర్డింగులు ఫ్లెక్సీలు బ్రోచర్లు వేస్తూ విద్యార్థులను, విద్యార్థుల




తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుంది. పేరుకు అకాడమీలని చెప్పుకుంటూ విద్యాశాఖ కండ్లు గప్పి జూనియర్ కళాశాలలు నిర్వహించడం సిగ్గుచేటు, కళాశాల పర్మిషన్ లేకుండా ప్రభుత్వాన్ని మోసం చేస్తూ కళాశాలలు నిర్వహిస్తూ, అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు లక్షలలో వసూలు చేస్తున్న అవని యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆ కళాశాలలను సీజ్ చేయాలని గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నిరు పేద కుటుంబానికి చెందిన గుమలాపురం సారయ్య అనారోగ్య సమస్యతో అకాల మరణం చెందాడు. అతడి కుటుంబానికి సహాయం చేయాలన్న ఉద్దేశంతో శనివారం స్థానిక 9వ వార్డు మాజీ కౌన్సిలర్, బీజేపీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణ చారి, వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సారయ్య భార్య గుమలాపురం మరియమ్మ, అతని కుమారులు వీరాస్వామి, రవితేజ, వారి కుటుంబ సభ్యులు, కడారి నాని, లక్ష్మి, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, సీత, వార్డు ప్రముఖులు, మార్త భిక్షపతి, దార్నా నారాయణ దాసు, దాసరి వెంకన్న, సంఘ నరేష్, బూర వెంకటేశ్వర్లు, వావిలాల రాజయ్య, సామల భిక్షపతి పాల్గొన్నారు.

# పెండ్లి ఉపేందర్ రెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో కొన్ని సంవత్సరాలుగా స్వచ్ఛత, పరిశుభ్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రేరణ విద్యా వికాస ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత ఛాంపియన్ షిప్ అవార్డుతో ఇటీవల సత్కరించింది. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాన సభ్యులు ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తో పాటు సునీత, జయశ్రీ, సృజన, క్రాంతి తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో అనేక ఇతర సేవా కార్యక్రమాలు చేసి నగర అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.

# పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

TELANGANA POLICE
FOR YOU WITH YOU ALWAYS

**వరంగల్ వాయిస్, మల్హర్ (పలిమెల) :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు పలిమెల గ్రామంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాల వాలీబాల్ తో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పలిమెల ఎస్సై రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో భూపాలపల్లి, ములుగు జిల్లాలతో పాటు చత్తీస్ గడ్ రాష్ట్రం లోని బీజాపూర్, మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని, పోటీలలో గెలుపొందిన టీంలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు ప్రైజ్ మనీ అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పోటీలకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, క్రీడా కారులకు మధ్యాహ్న భోజన వసతి, దూర ప్రాంత క్రీడా కారులకు వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆసక్తి గల క్రీడాకారులు 27 సాయంత్రం 5 గంటల లోపు కానిస్టేబుల్ హమీద్ మొబైల్ 7396147071, శ్రవణ్ మొబైల్ 7306907549 నెంబర్లను సంప్రదించి తమ టీం వివరాలు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## బాధిత కుటుంబాలకు చేయూత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన అనుమాండ్ల ప్రేమలత ఇటీవల వడ్ల కొనుగోలు కేంద్రంలో వడదెబ్బతో మరణించగా శనివారం వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సాయం అందించారు . అనంతరం ఇటీవల మరణించిన అదే గ్రామానికి చెందిన చెవుల నరసయ్య యాదవ్, కుటుంబాన్ని అలాగే ఇటీవల ఆటో ప్రమాదంలో వివిధ ప్రాక్చర్లతో హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన ధర్మారపు సాయమ్మ ధర్మారపు సాలమ్మ, ధర్మారపు సాయిలు ధర్మారపు మైసయ్య ఆయా కుటుంబాలను ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా నాయకుడు పరిపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట తొర్రూరు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మండల మాజీ జడ్పీటీసీ జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమాన్ల ప్రదీప్ రెడ్డి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, బీఆర్ఎస్ తొర్రూరు సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్రం రాజు, చర్లపాలెం మాజీ ఎంపీటీసీ ధర్మారపు కిరణ్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, జినుగ అనంతరెడ్డి, పెరటి మురళీకృష్ణారెడ్డి, ఏకు మల్లారెడ్డి, అన్నారపు రాములు, మిరియాల కరుణాకర్ రెడ్డి, నక్క మహేందర్, సింగారం సతీష్, గజ్జి యాకయ్య, చెవుల వెంకన్న యాదవ్, ధర్మారపు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వ ఆయుర్వేద పరిషత్ ఫౌండేషన్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విశ్వ ఆయుర్వేద పరిషత్ ఫౌండేషన్ డే వేడుకలు మెడికవర్ హాస్పిటల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. దినేష్ రెడ్డి (ఎమర్జెన్సీ మెడిసిన్), డా.లక్ష్మి దీపక్ నాగుల్ (క్రిటికల్ కేర్), డా.శ్రవణ్ కుమార్ జోగు (నెఫ్రాలజీ) పాల్గొన్నారు. వేదికగా ఆయుర్వేద వైద్యుల కోసం బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) పై శిక్షణ నిర్వహించగా, మొత్తం 110 మంది వైద్యులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ మార్కెటింగ్ హెడ్ హరినాథ్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్, అలాగే బీఏఎంఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాము, మహేష్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఒక విధంగా చూస్తే, ఆయుర్వేద వైద్యులకు అత్యవసర పరిస్థితుల్లో జీవరక్షణపై అవగాహన కలిగించడంలో ఈ కార్యక్రమం ముఖ్యపాత్ర పోషించింది.

## పోకల పలుకులు పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కీ.శే. లయను పూర్వ గవర్నర్ పోకల చందర్ రచించిన ‘ పోకల పలుకులు’ పుస్తక ఆవిష్కరణ సభ శనివారం రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ఆత్మీయులు బంధుమిత్రులు శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా జరిగింది. ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ జర్నలిస్టు పెండెం వేణుమాధవ రావు వాఖ్యాతగా వ్యవహరించగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త, గౌరవ అతిథి ఉప్పల శ్రీనివాస్ గుప్త, చందర్ కుటుంబ సభ్యులు నీల్ పోకల, రమ్య, దేవి, జి. మేఘణేశ్వర్, ఆర్. నమశ్శివాయ, పోలా శ్రీ ధర, కందికొండ శ్రీనివాస్, కట్ట రవి కుమార్, ఎన్. వెంకటేశ్వర రావు, చందర్ సహచర పూర్వ జిల్లా గవర్నర్ కె. గోవింద్ రాజ్, తమ్మీర లక్ష్మి నరసింహ రావు, కన్న పరశురాములు, హన్మకొండ లయన్స్ క్లబ్ సభ్యులు ఎస్. ఎం. రెడ్డి, ఆర్. రమణా రెడ్డి, కె. రమణయ్య, సత్యనారాయణ, ధనుంజయ పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి

■ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని గాయత్రి గార్డెన్ లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్యఅతిథిగా హాజరై, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టంలోని ముఖ్యాంశాలను రైతులకు వివరించారు. అనంతరం కొందరు రైతులు తమ భూసంబంధిత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వారికీ భూ భారతి చట్టం ద్వారా సమస్యలు ఎలా పరిష్కరించవచ్చో వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం ఒక సమగ్ర వ్యవస్థగా అభివృద్ధి చేయబడిందని, ప్రతీ పౌరుడు దీనిపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ధరణి చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేకపోవడంతో కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందని, కానీ భూ భారతి చట్టం లో మాత్రం తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశముందని చెప్పారు. మే నెలాఖరులోగా ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు సందర్శించి ప్రజల నుండి భూసంబంధిత దరఖాస్తులను స్వీకరించనున్నారని, విచారణ అనంతరం భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు. భూమి వారసత్వానికి సంబంధించిన వివరాలు, సర్వే మ్యాప్ లతో సహా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో పొందుపరచడం వల్ల భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చన్నారు. పాస్ బుక్ లో మ్యాప్ ను చేర్చడం వల్ల భూముల కొనుగోలు, విక్రయ ప్రక్రియలు సులభతరం అవుతాయని చెప్పారు. గ్రామ పరిపాలన అధికారుల ద్వారా భూసంబంధిత సమస్యలు ప్రత్యక్షంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఆన్‌లైన్ తో పాటు ఆఫ్‌లైన్ లోనూ రెవెన్యూ రికార్డుల భద్రతను కల్పించనున్నామని, తెల్ల కాగితంపై భూమి కొనుగోలు చేసిన సాదా బైనామా దరఖాస్తులకు కూడా భూ భారతి ద్వారా పరిష్కార మార్గం కల్పించనున్నామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయేతర భూములకు ప్రాపర్టీ కార్డు ఇచ్చి, వాటి ఆధారంగా రైతులు లోన్లు పొందే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ హుస్సేన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనలో ఏకాగ్రతే ముఖ్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు ఏకాగ్రతతో శ్రమించాలని అపుడే సాధన సుసాధ్యం అని లయన్స్ ఇంటర్నేశనల్ పూర్వ జిల్లా గవర్నర్, ఎస్ ఆర్ సీ స్కూల్ డైరెక్టర్ డా.ముచ్చ రాజిరెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన శ్రీనివాస రామానూజన్ కాన్సెప్ట్ స్కూల్ పూర్వ విద్యార్థుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంటర్ ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు సూరం నవనీత్ బై పీసీలో 440కి గాను 436 మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో తృతీయ ర్యాంకు సాధించారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో ఏ.వైష్ణవి 990, టి.మనస్విని 980, టి.విజయ 977, ఆర్.వసంత రెడ్డి 974 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. పాఠశాల కరస్పాండెంట్ ముచ్చ అరుణ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపికలు బహుకరించి సన్మానించారు. స్పందించిన విద్యార్థులు మాట్లాడుతూ మా విజయానికి స్ఫూర్తి మాకు బోధించిన ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్ మెంట్ ప్రణాళికబద్ధమైన నిర్వహణ సామర్థ్యం మాకు మాకు నిర్దేశం అయ్యాయాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించి తమకు సంతృప్తిని కలిగిస్తూ, పాఠశాల మేనేజ్మెంట్ అబిమానం చూరగొన్న విద్యార్థులను అభినందించారు.

## ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య శనివారం టేకులగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మందిరంలో అందిస్తున్న 12 రకాల వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా టెటనస్ టాక్సాయిడ్ (టీటీ), ఆంటీ రెబిస్ వ్యాక్సిన్ (ఏఆర్ వీ), వియాల్స్ స్టోరేజీ, వాడుక వివరాలను పరిశీలించారు. అలాగే, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ద్వారా హైపర్ టెన్షన్ (181 మంది), డయాబెటిస్ (59 మంది) రోగులు, అలాగే 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. తర్వాత, డాక్టర్ అప్పయ్య సోమిడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, అక్కడి నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ విజయకుమార్ బోడగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పల్లె దావఖాన డాక్టర్ జ్యోత్స్న, సోమిడి వైద్యాధికారి డా.అనిత, బోడగుట్ట వైద్యాధికారి డాక్టర్ సృజన, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేసేందుకే కేసీఆర్ ఎత్తులు

● సంఘం జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్



**వరంగల్ వాయిస్, జనగామ :** దేశంలోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జనగామ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనగామలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో బీసీ సంక్షేమ సంఘం జనగామ పట్టణ అధ్యక్షుడు జాయ మల్లేష్ కురుమ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్ఎస్ బిజెపి పార్టీలు ఆయా పార్టీల రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలనే నియమించాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రజలకు బీఆర్ఎస్, బీజేపీలో చేసిన అభివృద్ధి ఏమి లేదని, బీసీలకు రాజ్యాధికారం రాకుండా నిలువరిస్తురని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ రేపు వరంగల్ లో నిర్వహించనున్న బహిరంగ సభ కూడా మళ్లీ బీసీలను మోసం చేయడానికేనని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వేస్తున్న ఎత్తులను గమనిస్తున్నారని, కేసీఆర్ ను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా బీసీ సమాజం పట్ల బీఆర్ఎస్, బీజేపీల వైఖరిని స్పష్టం చేయాలని, బీసీల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్ గౌడ్, రజక చైతన్య సంఘం జిల్లా నాయకుడు ఎదునూరి రవీందర్, కొలిపాక రాములు, కురుమ సంఘం నాయకులు దేవర సత్యనారాయణ, యాదవ సంఘం నాయకులు చంద్ర శ్రీనివాస్, కుమ్మరి సంఘం నాయకులు నాంపల్లి అశోక్ , పద్మశాలి సంఘం నాయకులు వల్లాల మల్లేశం, బీసీ సంఘం నాయకులు బత్తిని అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# త్వరలోనే రాజాసాబ్ టీజర్

### సన్నాహాల్లో మూవీ బృందం

ప్రభాస్ నటిస్తున్న తాజా సినిమా రాజాసాబ్. షూటింగ్ స్టార్ట్ చేసి చాలాకాలం అవుతున్నా ఈ సినిమా ఇంకా అలానే సాగుతూ.. ఉంది. అదిరిపోయే పాటలు, ఫైట్స్, కామెడీ, డ్యాన్స్‌తో పాటు ముగ్గురు హీరోయిన్లతో రొమాన్స్ చేస్తున్నాడు డార్లింగ్. పైగా ఫస్ట్ హార్రర్ రొమాంటిక్ కామెడీ మూవీ రాజాసాబ్. ఇన్ని విశేషాలు ఉన్న ఈ సినిమా ఎందుకనో స్టార్ట్ అయిన దగ్గరునుండి రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పటికే రివీల్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. వాస్తవానికి ఈ సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికి ఈ సినిమా షూటింగ్ పెండిరగ్ దశలోనే ఉంది. కానీ దర్శకుడు మారుతి మాత్రం సమ్మర్‌లో అదిరిపోయే ట్రీట్ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. రీసెంట్‌గా మే నెల మిడ్‌లో అప్డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు మారుతి. హై అలర్ట్ మే నెలలో హీట్ వేవ్స్ మరింత పెరగనున్నాయి అని ఒక టీ–`వట్ చేశారు. దీంతో ఎలాంటి అప్డేట్ ఇవ్వబోతున్నాడా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు రెబల్ ఫ్యాన్స్. అయితే రాజాసాబ్ టీ–జర్ రిలీజ్‌కు మారుతీ ఎ□`లాన్ చేస్తున్నట్టు–గా సమాచారం. ప్రస్తుతం సాలిడ్ టీజర్ కట్ చేసే పనిలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ టీజర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్ పనులు కూడా పూర్తయ్యాయని తెలుస్తోంది. ప్రస్తుతం విదేశాలలో ఉన్న ప్రభాస్ తిరిగి రాగానే తనతో డబ్బింగ్ పూర్తి చేసి టీజర్ విడుదల తేదీని రివీల్ చేస్తారని సమాచారం. అందాల భామలు నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది.

# ఇండస్ట్రీకి రాకముందే ఆ విషయాలు తెలుసు..



**> అమ్మా,నాన్నల విడాకులు తీవ్రంగా కలచివేసింది**


**> నటి శృతిహాసన్ మనోగతం**

తల్లిదండ్రులు విడిపోతే పిల్లల జీవితాలు దుర్భరంగా మారుతాయి. ఒక్కోసారి తలకిందులవుతాయి. ముఖ్యంగా సినిమాపరిశ్రమలో విడాకుల వ్యవహారాలు చాలానే ఉన్నాయి. అందులో కమలహాసన్, సారికల ఎపిసోడ్ కూడా ఉంది. వారి కూతురే శృతిహాసన్. కమల్‌హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రుతి హాసన్ సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడిరచారు. ఇండస్ట్రీకి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు. తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్‌లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను‘ అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్ , సారిక 2004లో విడిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం శ్రుతి 'కూలీ' సినిమాలో నటిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దీన్ని రూపొందిస్తున్నారు. నాగార్జున, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఇది ముస్తాబవుతోంది. ఆగస్టు 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.

# అలా చీప్ కామెంట్స్ ఎలా చేస్తారు ?

సోషల్ మీడియా తీరుపై శేఖర్ మాస్టర్ ఆగ్రహం ఓ మహిళా డ్యాన్సర్ విషయంలో సోషల్‌మీడియాలో వచ్చే కామెంట్స్ తనని ఎంతో బాధించాయని ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఇలాంటి కామెంట్స్ ఎలా చేస్తుంటారని ప్రశ్నించారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన పలు కాంట్రవర్సీల గురించి మాట్లాడారు. ఇలాంటివన్నీ చీప్‌గా అనిపిస్తున్నాయన్నారు. పలు టీవీ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించడం సరదాగా అనిపిస్తుందని.. ఎలాంటి టెన్షన్స్ ఉండవని ఆయన వెల్లడిరచారు. కొరియోగ్రాఫర్‌గా వర్క్ విషయంలో కాస్త ఒత్తిడి ఉంటుంది. కానీ, టీవీ కార్యక్రమాలకు వచ్చేసరికి అలా ఏమీ ఉండదు. జడ్జ్‌గా వ్యవహరించడం రిలాక్స్‌గా అనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ డ్యాన్స్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా డ్యాన్సర్ విషయంలో చాలా విమర్శలు ఎదురయ్యాయి. నిజం చెప్పాలంటే, ఆ సీజన్‌లో పాల్గొన్న మిగిలినవారితో పోలిస్తే ఆమె బాగా డ్యాన్స్ చేస్తుందనిపించింది. అందుకే ఆమెను మెచ్చుకున్నా. దానిని కొంతమంది తప్పుగా అర్థం చేసుకున్నారు. టాలెంట్ ఉన్న వాళ్లను ప్రోత్సహించకూడదా? నా వల్లే ఆమె విజేత అయిందన్నారు. మా గురించి ఇష్టం వచ్చిన కామెంట్స్ చేశారు. సోషల్‌మీడియాలో నా పోస్టులకు ఆమె గురించి కామెంట్స్ పెట్టేవారు. ఆ సమయంలో నేను ఎంతో బాధపడ్డా. ఆ షో తర్వాత ఆమె ఎవరో కూడా నాకు తెలియదని ఆయన వెల్లడిరచారు. ఇండస్ట్రీలో ఒక ప్రముఖ కొరియోగ్రాఫర్‌తో తనకు పడదని వచ్చిన వార్తలపై మాట్లాడుతూ.. అందులో నిజం లేదన్నారు. అందరితోనూ తనకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. మేమంతా మంచిగానే ఉంటాం. కలిసినప్పుడు మాట్లాడుకుంటాం. మేము సరదాగా మాట్లాడుకుంటున్న ఫొటోలు కూడా చాలా సందర్భాల్లో బయటకు వచ్చాయి. కాకపోతే, బయటవాళ్లు మాత్రం మా మధ్య ఏవో గొడవలు ఉన్నట్లు– మాట్లాడుకుంటున్నారంతే‘ అని శేఖర్ మాస్టర్ స్పష్టతనిచ్చారు.






# శర్వానంద్‌తో మరోమారు అనుపమ

### సంపత్ నంది సినిమా కోసం కథ సిద్ధం



టాలీవుడ్ నటుడు శర్వానంద్ తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. సంపత్ నంది ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. 1960ల చివర్లో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. మరపురాని అనుభూతిని కలిగించే పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే మూవీ కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు శర్వానంద్. మే మొదటివారం నుంచి షూటింగ్ శరవేగంగా ప్రారంభం కాబోతుండగా.. ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేశారు. ఇదిలావుంటే ఈ మూవీలో కథానాయికకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీలో హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. గతంలో శర్వానంద్, అనుపమ కలిసి శతమానం భవతి అనే సినిమాలో నటించారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ జోడి మళ్లీ జత కడుతుండడంతో భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.

# మావోలతో శాంతి చర్చలు జరపాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి
- పౌర హక్కుల సంఘాల వినతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మావోయిస్టుల నిర్మూలనే అంతిమ యుద్ధంగా కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో సాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల ప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గత నాలు రోజులుగా చత్తీస్ ఘడ్, తెలంగాణ సరిహద్దుల్లోని ఊసురు కర్రెగట్టల్లో చేపట్టిన కూంబింగ్ ను నిలిపివేసి మావోయిస్టుతలో శాంతి చర్చలు జరపాలన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ లో శనివారం పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల ప్రతినిధులు నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో శాంతి యుత వాతావరణం ఏర్పాటుకు కేంద్రం చర్చలు జరపాలన్నారు. విప్లవ పార్టీలు, ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగితే అందరికీ ఉపయోగకరం అన్నారు. మావోయిస్టులు, కేంద్రం మధ్య జరుగుతున్న పోరాటంలో ఆదివాసీలు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నుంచి మావోయిస్టులు ఉన్న సంగతిని మరువరాదన్నారు. ఆదివాసి ప్రజలు భయానక వాతావరణంలో జీవిస్తున్నారన్నారు. శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టకోవండి దుర్మార్గమన్నారు. ఇప్పటికే వారు శాంతి చర్చల కోసం లేఖలు రాశారన్నారు. ఈ దేశం ప్రజలను ఇక్కడి సైన్యాలే చంపడం మంచి పరిణామం కాదన్నారు. గతంలో సుప్రీం కోర్టు కూడా తెలిపిందని గుర్తు చేశారు. ఇట్టి ఏకపక్ష హననాన్ని దేశ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మేధావులు కూడా శాంతి చర్చలకోసం కమిటీని ఏర్పాటు చేసి ముందుకు రావాలన్నారు. ఈ కార్కమంలో హరగోపాల్ తోపాటు గడ్డం లక్ష్మణ్, గోపీనాథ్ భారత్ బచావో ఇన్నారెడ్డి, రవిచందర్, డాక్టర్ తిరుపతయ్య, జనగం కుమారస్వామి, శాంతి, సుదర్శన్, రామ సీఎంఎస్, చందు రాజేందర్, డాక్టర్ కృష్ణ కొణితం, ఎం.ప్రవీణ్ కుమార్, మాదాసి సురేష్, నున్న అప్పారావు, పి.రమేష్ సుందర్, శ్రావణ్, మద్రి మహేష్, పీడీఎఫ్ క్రాంతి, అరసం ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎం.శంకర్ పాల్గొన్నారు.

# కల్లు, గుడాలు ఏమాయే..?

- బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కల్లు, గుడాలు ఏమాయే కేసీఆర్ అంటూ బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నిలదీశారు. రెండు పడక గదుల ఇండ్లు కట్టుకుందాం.. అందరం కలిసి సంతోషంగా పండుగ చేసుకుందాం.. యాటను కోసి దావత్ చేసుకుందాం..కల్లు, గుడాలతో ఎంజాయ్ చేద్దామని మభ్యపెట్టి ఉన్న గుడిసెను కూల్చివేసి నిరుపేదలకు నిలువ నీడ కూడా లేకుండా కేసీఆర్ చేశారంటూ మండిపడ్డారు. వరంగల్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గంట రవికుమార్ మాట్లాడుతూ ఉద్యమం పేరు చెప్పి పదేళ్లు అధికారం అనుభవించిన కేసీఆర్ కుటుంబా చేసింది శూన్యమన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూకబ్జాలు చేశారన్నారు. వరంగల్ కు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. అందుకే వరంగల్ నగరంలో సభ పెడితే ఫెయిల్ అవుతుందని భావించి కరీంనగర్, సిద్దిపేట బార్డర్ లో పెట్టుకుంటున్నారన్నారు. గప్పాలు కొట్టే పిట్టలదొర మళ్లీ వస్తున్నాడు.. ఓరుగల్లు ప్రజలు తస్మాత్ జాగ్రత్త అంటూ రవికుమార్ హెచ్చరించారు. ఎల్కతుర్తిలో సభ పెట్టి చలో వరంగల్ అని పిలుపునియ్యడం సిగ్గుచేటన్నారు. వరంగల్ కు మాస్టర్ ప్లాన్ అమలు చేయకుండా పదేండ్లు అభివృద్ధిని అడ్డుకొని 50 ఏళ్లు నగరాన్ని వెనక్కి నెట్టిన నీచపు చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అన్నారు. ప్రతి ఏడాది వరంగల్ నగరానికి రూ.300 కోట్లు ఇస్తామని చెప్పి ఒక్కపైసా ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత రోడ్లు అంటూ ఆకాశాన్ని తాకే హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. 2023 ఎన్నికల ముందు రూ.750 కోట్లతో అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టిన కేటీఆర్ ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. కాకతీయుల ఘన చరిత్ర కలిగిన ఓరుగల్లు మహానగరాన్ని చిన్నచూపు చూసి ముక్కలు చెక్కలు చేశారని విమర్శించారు. సిద్దిపేటను అభివృద్ధి చేసేందుకు వరంగల్ నిధులను మళ్లించిన దరిద్రపు పార్టీ బీఆర్ఎస్ అని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఎయిర్ పోర్ట్ ను మంజూరు చేసినా భూసేకరణ చేయకుండా అడ్డుకున్నది ఆ పార్టీ నేతలే అన్నారు. సైనిక్ స్కూల్, హెచ్ఆర్ డీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లాంటి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలకు భూమి కేటాయించకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. వరంగల్ ను నిండా ముంచిన బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఏ ముఖం పెట్టుకొని సభ పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ ఎక్కడ సభ పెట్టినా ఆ భూములు కబ్జాలకు గురయ్యాయన్నారు. గతంలో హనుమకొండ ప్రకాశ్ రెడ్డి పేటలో కావచ్చు.. హైదరాబాద్ లోని కొంగరలోనూ అదే జరిగిందన్నారు. ఇప్పుడు ఎలుకతుర్తి సమీప గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చదును చేసిన భూముల్లో హద్దులు జరిపిన బీఆర్ఎస్ నేతలు గద్దల్లా వాలుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయాల్, గడల కుమార్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధులు ఆడెపు వెంకటేష్, శ్రీరంగం సాగర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నాయకులు రామిని సుమన్, ముంద్రాతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# మరమ్మతులు చేయించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రధాన కార్యాలయంలోని ఛాంబర్ లలో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన ఛాంబర్ లలో దెబ్బతిన వివిధ వసతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. పాత భవనంలోని వివిధ విభాగాల ఛాంబర్ లను కమిషనర్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్యాలయంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, నీటి సరఫరాను పునరుద్ధరించడంతోపాటు పాడైన కుర్చీలు, టేబుల్స్ స్థానంలో కొత్తవాటిని సమకూర్చుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ సంబంద సమస్యలను పరిష్కరించడం, అవసరమున్న ప్రాంతాల్లో కంప్యూటర్ ల ఏర్పాటు తదితర సమస్యలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేసేలా చూడాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, డీఈలు రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, జేఏఓలు సరిత, జగదీశ్వరి, సూపరిండెంట్ రావుల ఆనంద్, ఏఈలు రాగి శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ కు విస్తృత ఏర్పాట్లు..

సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహణలో భాగంగా క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఇండోర్ స్టేడియంతో పాటు స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను కమిషనర్ క్షేత్ర స్థియిలో పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించడానికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రవి కుమార్, మాధవి లత, డీఈలు కార్తీక్ రెడ్డి, రాజ్ కుమార్, ఏఈలు రాగి శ్రీకాంత్, నరేష్, స్టేడియం సిబ్బంది భారత్ తదితరులు పాల్గొన్నారు.



# ధిక్కార స్వరమై.. గర్జించేదెన్నడు

వందల వేల సంవత్సరాలుగా
తల్లిగా చెల్లిగా నిచ్చెలిగా బహు పాత్రధారియైన
సమాజంలోని స్త్రీల పట్ల అమలవుతుంది అధికారిక వివక్ష
అదే కోవలో.. సరికొత్తకోణంలో .. ఉద్యమాల గడ్డనే వేదికగా
అర్ధ నగ్నంగా అమ్మాయిలను ప్రదర్శించి
అందాలను వీక్షించి , అతివలను అవమానించి
మహిళల మానాభిమానాలను మంటలో వేసి
మిస్ యూనివర్స్ ను నిర్ణయిస్తున్నారు
అయిననూ మాకు దయ లేదు.
కాస్తయిన మాలో తిరుగుబాటు రాదు
మేము అసలు విమర్శించం, కనీసం సమీక్షించం
పుణ్య భారత భూమిలో అమ్మతనాన్ని
అమ్మకపు సరుకుగా మార్చింది ఎవరు
ఆడతనాన్ని అంగడి బొమ్మగా .. వేలం పెట్టింది ఎవరు
పైశాచిక రాక్షసానందం పొందేది ఎవరు
స్త్రీని దాసిగా చూసిందెవరు ..
అబలగా మార్చి బలి చేసిందెవరు
అమ్మ చేతి వంట అమృతని వంటింటి కుందేలుగా
మార్చింది ఎవరు..
స్త్రీ రావలసింది రాత్రి వేళలో పడకగదికి మాత్రమేనని
శాసించింది ఎవరు
భూమాత ధనమాత, చదువుల మాత, జగన్మాత ,
సంతోషిమాత.. ఇంతమంది మాతలు ఉన్న దేశంలో
నా ఆడపడుచులు మాతలు కాదా.. మాతంగి కన్యలేనా..
గతకాలపు బానిస సమాజంలో,
నాటి భూస్వామ్య సమాజంలో
నేటి ఆధునిక సమాజంలో ప్రస్తుత సోషలిస్టు సమాజంలో
శాస్త్ర సాంకేతిక ప్రావీణ్యతతో ప్రగతిని సాధించిన తరుణంలో
ఆనాడు ఈనాడు ఏనాడు, ప్రతి కాలంలోనూ
ఆడది ఆట వస్తువేనని , స్త్రీ కేవలం అలంకారమేనని
అందాల పోటీలు కాస్తుంటే .. అడ్డు తగలక ఆనందిస్తున్నాం
స్త్రీ దాసి కాదు దార్శనికురాలని
అబల అంటే బలయేడిది కాదు.. మూర్ఖత్వాన్ని బలిచ్చేడిదని
స్త్రీ రావాల్సింది రాత్రి వేళలో పడకగదికి కాదు
రాజ్యాధికారానికి అని నిరూపించేది ఎన్నడు
తమ బిడ్డలకు పాలిచ్చిన వారే
ఈ దేశాన్ని పాలించాలని కోరేది ఎన్నడు
మేము అణిగిమనిగిలేము లొంగిపోయే వాళ్లం కాము
పూబోణీలం కాబోము, పోరాట పతాకాలము
భయకంపిత నిశ్శబ్దాలం.. రగిలే అగ్ని పర్వతాలమంటూ
నినదించేది ఎన్నడు .. దిక్కర స్వరమై గర్జించేది ఎన్నడు



**మాదాసి సురేష్,**
సెల్ : 9985738685
(వచ్చే నెలలో హైదరాబాదులో ప్రపంచ అందాల పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా..)

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com